RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 204 | జులై 10, 2025 | వెల : రూ.3-00



కుప్పకూలిన గంభీర వంతెన

4లో..

## పార్టీ కోసమే కేసీఆర్

# నీళ్ల సెంటిమెంట్

- ఆయన పాలనలోనే రాష్ట్రానికి తీవ్రనష్టం
- కృష్ణా జలాలపై చర్చిద్దామని సూచించా
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం, జలాలపై మంత్రి ఉత్తమ్ పీపీటీ ప్రజెంటేషన్





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

చచ్చిపోయిన బీఆర్ఎస్ పార్టీని బతికించుకోవడానికే కేసీఆర్ నానా పాట్లు పడుతున్నారని, పార్టీ కోసమే నీళ్ల సెంటిమెంట్ తీసుకొస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల వల్లే తెలంగాణకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో తెలంగాణ నష్టపోయినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్ జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో కాళేశ్వరంపై వాస్తవాలతో కూడిన నివేదికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారని చెప్పారు. నివేదికల వాస్తవ పరిస్థితులను కేంద్రం ఎదుట ఉంచామని వెల్లడించారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని కేసీఆర్‌కు సూచించానని, సవాల్ చేయలేదని సీఎం స్పష్టత ఇచ్చారు. కేసీఆర్ పాలనలోనే కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం రేవంత్ చెప్పారు. నీళ్లు, నిధుల శాఖలను కేసీఆర్ కుటుంబమే పదేళ్లు నిర్వహించిందని పేర్కొన్నారు.



### అఖిలపక్షం ఆధ్వర్యంలో

# రాస్తారోకో

– కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ..

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి:**

దామరచర్ల మండల కేంద్రంలో నార్కెట్‌పల్లి–అద్దంకి రహదారిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం కార్మిక లోకం పెద్ద ఎత్తున తరలివచ్చి సార్వత్రిక సమ్మె కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వినోద్ నాయక్, ఉదయ్ కుమార్, ఎర్ర నాయక్, దయానంద్ సంయుక్తంగా మాట్లాడుతూ దేశంలో 11 సంవత్సరాల బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తోందని విమర్శించారు. బ్రిటిష్ ప్రభుత్వం కాలం ముందే సాధించుకున్న కార్మిక 29 హక్కులను రద్దుచేసి నేడు మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలు మారుస్తున్నారని పేర్కొన్నారు. దీనివలన దేశంలో కార్మిక కర్షక ప్రజానికం ఎనిమిది గంటల పని దినం నుండి 12 గంటల పని దినంగా మారుస్తూ చట్టం తీసుకోరాబోతున్నట్టు తెలిపారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని.. ఉపాధి

మిగతా 2వ పేజీలో..

### వ్యాపారాలు నిర్వహించేలా

# చర్యలు చేపట్టండి

– కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేట మార్కెట్ లో వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ నగర పరిధి లోని ఖాజీపేట మార్కెట్ బాల సముద్రం ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం గా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ల మీద వ్యాపారాలు నిర్వహించడం వల్ల వినియోగదారులు మార్కెట్ లోకి రావడంలేదని కాజీపేట మార్కెట్ కు సంబంధించి స్థానిక మార్కెట్ దారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రోడ్డు మీద కూరగాయలు అమ్మే వారిని మార్కెట్ లో వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్ లు ఓపెన్ చేసి మటన్ చికెన్ విక్రయించే దుకాణాలను అక్కడే వ్యాపారాలు నిర్వహించేలా చూస్తూ మార్కెట్ ను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కూరగాయల మార్కెట్ యందు పోలీసు, పట్టణ ప్రణాళిక విభాగం ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో స్ట్రీమ్ లైన్ చేసి వీధి వ్యాపారులకు ఉపాధి అందేలా చూడాలని, స్లాటర్ హౌస్ చిన్నగా ఉందని ఇందుకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అవకాశం

మిగతా 3వ పేజీలో..

### హక్కుల సాధనకు

# జర్నలిస్టుల ఐక్య పోరాటాలు

- వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను కొనసాగించాలి
- మీడియా రంగంలో పెట్టుబడిదారుల ప్రవేశం ప్రమాదకరం
- జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలి: టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలతో పాటు రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను తొలగించేందుకు తీసుకుంటున్న చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల రద్దుకు నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్),హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే) సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జర్నలిస్టుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్ యుజే అధ్యక్షుడు బి.అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి

మిగతా 3వ పేజీలో..

# నూతన పీఎస్‌లు ప్రారంభించిన పొన్నం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం శాలిబండ పోలీస్ స్టేషన్, ఛత్రినాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లకు నూతన భవనాలను పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం బిల్డింగ్స్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు మంత్రి శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు. అనంతరం పురాని హవేలీ లోని నిజాం కాలం నాటి హైదరాబాద్ సీపీ ఆఫీసు అయిన కొత్వాల్ హౌజ్ (రిస్టోర్డ్ హెరిటేజ్ స్ట్రక్చర్) ను ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,మీర్ జల్ఫికర్ అలీ,సీపీ సీవీ ఆనంద్ ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. 120 సంవత్సరాల కొత్వాల్ ఆఫీసు పునర్నిర్మాణం చేసుకున్నందుకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ ఆనంద్ , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తమ సీఎస్ఆర్ ఫండ్స్ నుండి ఆర్థిక సహాయం అందించి హెరిటేజ్ బిల్డింగ్ గురించి వచ్చే తరానికి గుర్తుండేలా చేసినందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు తెలిపారు. ఏఐ , సీసీ కెమెరాలు వంటి టెక్నాలజీ లను బలోపేతం చేయడానికి 72 పోలీస్ స్టేషన్‌లకు రూ.5 లక్షలు చొప్పున సుమారు 3 కోట్ల రూపాయలను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి గా పై మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో కల్తీ కల్లు కలకలం

### కల్తీ కల్లు ఘటన.. మూడు కల్లు కాంపౌండ్ పై కేసు నమోదు



**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో కల్తీ కల్లు ఘటన కలకలం రేపింది.. ఈ ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై సర్కార్ సీరియస్ అయింది.. మూడు కల్లు కాంపౌండ్లు సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు.. ఐదుగురిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. కూకట్‌పల్లి సర్దార్ పటేల్ నగర్, ఇంద్రహిల్స్, కె.పి.హెచ్.బి ఉషాముళ్లపూడి రోడ్డులోని కల్లు కాంపౌండ్‌లలోకల్లు తాగి దాదాపు 20మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు.

మిగతా 3వ పేజీలో..

# విద్యార్థులకు ఉచిత బ్యాగుల పంపిణీ

**వేద న్యూస్, బోయినిపల్లి :**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఏపిరాక్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బ్యాగులను అందజేస్తుందని ఆ సంస్థ మార్కెటింగ్ మేనేజర్ మునిరాజ్ అన్నారు.అలాగే బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు విలాసాగర్ ,వెంకటరావుపల్లి, లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏపీ రాక్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. బోయినిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్,మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్య బోధన ప్రైవేటు పాఠశాల లకు దీటుగా విద్య బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు ,ఉచిత నోటుబుక్కులు, యూనిఫార్మ్ తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తుండగా విద్యార్థులకు ఉన్న బ్యాగుల కొరత ను ఏపీరాక్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు తీర్చడం అభినందనీయమని అన్నారు. అనంతరం మార్కెటింగ్ మేనేజర్ మునీరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుపై శ్రద్ధ పెట్టి మంచిగా చదువుకొని ఊరికి, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత స్థానాలు చేరుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యంలో ఏపిరాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, సేల్స్ మేనేజర్ స్వప్న, తెలంగాణ ఏపీ డీలర్ ఉమాకాంత్, ప్రధానోపాధ్యాయులు బోలగం శ్రీనివాస్ , జలంధర్ ,రామా రావు, నారోత్తం రెడ్డి ,బోయినిపల్లి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు , గసికంటి శ్రీనివాస్, జగన్ మోహన్ రావు, సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో త్వరితంగా మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, గీసుకొండ :**



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం గీసుకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కావలసిన మౌలిక సదుపాయాలు, చేపట్టుటకు ప్రతిపాదించిన మరమత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా మంచి వాతావరణంలో విద్య బోధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల మరమ్మతులకు రూ. 1.36 కోట్ల నిధులు మంజూరు కాగా, అందులో గీసుగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 8.2 లక్షల మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఆయా పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కళాశాలలో విద్యార్థులకు గణితం సైన్స్, తెలుగు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులను చదువులో రాణించటానికి ప్రోత్సహిస్తూ పలు సూచనలు చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయని విద్యార్థులకు ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, టిజీ ఈడబ్ల్యూఐడిసి అసిస్టెంట్ ఇంజనీర్ మురళీకృష్ణ, తహసిల్దార్ రియాజోద్దీన్ ప్రిన్సిపల్ శోభా దేవి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పరిరక్షణకై పోరాడుదాం



**వేద న్యూస్, మఠంపల్లి :**

కార్మిక చట్టలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు పరిచిన లేబర్ కోడ్ లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేసారు. మఠంపల్లి మండలంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్మిక వెల్ఫేర్ బోర్డ్ నిధులను కార్మికుల కోసమే ఖర్చుచేయాలనీ, అదేవిధంగా రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రనీమియా, గిరిజన సంఘం అధ్యక్షుడు బాలు నాయక్, గ్రామపం చాయతీ అధ్యక్షుడు ఇంటు రవి, భవననిర్మాణ అధ్యక్షులు, ఆశ వర్కర్, అంగన్వాడీ, అమలి వర్కర్ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# అనధికారిక లే ఔట్ లు తొలగించాలి

**వేద న్యూస్, వరంగల్ :**



బల్దియా పరిధి లోని అనధికారిక లే ఔట్ లను గుర్తించి తొలగించుటకు చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్ లో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో మేయర్ సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో అనధికారిక లే ఔట్ లు ప్లాట్ లను కొనుగోలు చేయకూడదని వీటి పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించడానికి టౌన్ ప్లానింగ్ విభాగం వివిధ సామాజిక మాధ్యమాలు కరపత్రాలు ఫ్లెక్సీ ల ద్వారా అవగాహన కలిగించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీకి చెందిన ఓపెన్ ప్లాట్లు కాంపౌండ్ వాల్ లేని మున్సిపల్ స్థలాలు పార్కులు బల్దియా కు చెందిన ప్రాపర్టీలని సూచించే విధంగా బోర్డు లు ఏర్పాటు చేయాలని, గ్రీన్ ఏరియా కు సంబంధించిన ప్రాపర్టీ ని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని, బల్దియా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులు,సిబ్బంది అనధికార లేఅవుట్ లు, ముందస్తుగా గుర్తించాలన్నారు. వర్షాకాలం నేపధ్యంలో నగర వ్యాప్తం గా ఉన్న శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారికి నోటీసులు అందించి ప్రాణ, ధన నష్టం కలుగ కుండా ఖాళీ చేయించాలని, అపార్ట్మెంట్ లలో గల సెల్లార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు లేకుండా చూడాలని ఈ సందర్భంగా మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్రీనివాస్ రెడ్డి, రజిత, యెర్షాద్, ప్రశాంత్ తో పాటు టిపిఎస్ టిపిబిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పోలీస్ పని తీరు భేష్

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



మల్టీజోన్ టు ఇన్చార్జి ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్ సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ముందుగా జిల్లా ఎస్పీ నరసింహ పోలీసు గౌరవ వందనంతో స్వాగతం తెలిపి పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. అనంతరం సమావేశ మందిరం నందు ఎస్పీ తో కలిసి సిఐలు డీఎస్పీల తో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, జిల్లాలో ఉన్న ప్రముఖ ప్రాంతాలు, ప్రముఖ వృత్తులు, జనాభా, రాజకీయ పరిస్థితులు, ఈ సంవత్సరంలో నమోదైన నేరాలు వాటి తీరుతెన్నులు, నేరాల నివారణలో జిల్లా పోలీసు ప్రణాళిక, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరపటానికి తీసుకోబోతున్న చర్యలు, పోలీసు ప్రజా భరోసా, ప్రజా అవగాహన చైతన్య కార్యక్రమాలు, కళాబృందం, షీ టీమ్స్, భరోసా టీమ్స్ మొదలగు అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఎస్పీ నరసింహ ఇన్చార్జ్ ఐజిపి కి వివరించడం జరిగినది. కేసుల నమోదు, ఫిర్యాదుల నిర్వహణ, పోలీస్ ప్రజా భరోసా, పబ్లిక్ ఫీడ్ బ్యాక్, కోర్టు మానిటరింగ్, డయల్ 100 స్పందన, ఎన్ఫోర్స్మెంట్, ప్రజా అవగాహన కార్యక్రమాలు, పోలీసు పని తీరు, కేసు దర్యాప్తు, నైపుణ్యాల ను ఇన్చార్జి ఐజిపి పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ నేరాల నివారణలో ముందస్తు ప్రణాళికతో పని చేయాలని, కేసుల దర్యాప్తులో నైపుణ్యం చూపాలని ఆదేశించారు. నేరాల నివారణకు ముందస్తుగా పని చేయాలి, క్షేత్ర స్థాయిలో సంచారం సేకరించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించడానికి సిద్దంగా ఉండాలి అని అన్నారు, సమస్యాత్మక విషయాలపై దృష్టి పెట్టాలనీ, గ్రామ పోలీసు అధికారిని యాక్టీవ్ చేసి గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టాలి. చిన్న సమస్యలు కొన్ని సందర్భాల్లో తీవ్ర సమస్యగా మారుతాయనీ, ఇలాంటి వాటిని ఆదిలోనే పరిష్కరించాలి అన్నారు. ఎన్నికల సమయంలో గతంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి అనేది పరిశీలించుకుని పని చేయాలనీ, ప్రతి అంశంపై నిశిత పరిశీలన పెట్టాలి అని ఆదేశించారు.

భౌతిక దాడుల జరగకుండా చూడాలనీ, పాత నేరస్తులు సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులు రౌడీలు కేడీలను ముందస్తుగా బైండోవర్ చేయాలని పాత నేరస్తులను, ట్రబుల్ మాంగర్స్ ను హేచ్చరించాలి అన్నారు. దొంగతనం ద్వారా పోయే డబ్బు కన్న సైబర్ మోసం ద్వారా పోయే డబ్బు ఎక్కువగా ఉంటుందని, కొత్త తరహాలో నేరాలు జరుగుతున్నాయని వివరించారు. పోలీసులు కూడా కొత్త తరహాలో అలొసుచి నేరాలు జరగకుండా ప్రజలకు, విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా మసులుకోవాలన్నారు. సూర్యాపేట చాలా ప్రశాంతత కలిగిన జిల్లా అని, అక్రమ కార్యకలాపాల పై కటినంగా పని చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ను చైతన్య పరిచి రక్షణ కల్పించాలని, డ్రగ్స్ లాంటి వ్యసనాలకు లోనూ కాకుండా నిఘా ఉంచాలనీ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ జరగకుండా విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేయాలనీ. పిల్లల అక్రమ రవాణా జరగకుండా చూడాలనీ, బాలకార్మిక వ్యవస్థ ను సమూలంగా నిర్మూలించాలనీ, జిల్లా యంత్రాంగం వారితో సమన్వయంగా పని చేయాలి అని కోరారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆదేశాలను జిల్లాలో అమలు చేస్తామని, ప్రోయాక్టివ్ గా పని చేస్తూ నేరాలను అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆదేశాలను జిల్లాలో అమలు చేస్తామని, ప్రోయాక్టివ్ నివారించడంలో బాగా కృషి చేస్తామని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పటిష్టంగా పనిచేసే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, ఏ ఆర్ అధనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, కోదాడ డివిజన్ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, ఏ ఆర్ డి ఎస్ పి నరసింహ చారి, ఏవో మంజు భార్గవి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, వెంకటయ్య, నరసింహారావు, నాగేశ్వరరావు, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, రజిత రెడ్డి, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

# వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



- గంగాధరలో లబ్ధిదారురాలికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే సత్యం
- ఆర్థిక పునరావాసం స్కీమ్ కింద వికలాంగురాలికి రూ.50 వేల సాయం

**వేద న్యూస్, చొప్పదండి/గంగాధర:**

రాష్ట్రంలోని వికలాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వికలాంగులకు ఆర్థికంగా భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఆర్థిక పునరావాస స్కీమును ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన మామిడిపల్లి విజయకు ఆర్థిక పునరావాస భరోసా పథకం క్రింద 100% సబ్సిడీతో రూ. 50 వేల ఆర్థిక సహాయం మంజూరు అయింది. బుధవారం గంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారురాలికి పరిహారం చెక్కును అందజేశారు. 100% సబ్సిడీపై ఆర్థిక సహాయాన్ని మంజూరి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇందుకోసం సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు విజయ కృతజ్ఞతలు తెలిపారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో



కూలీలకు 200 రోజులు పని దినం కల్పించి రోజుకు 600 రూపాయలు కూలీలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మిక కర్షక ప్రజానీకానికి సమీకరించి సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపా నాయక్,కోటి రెడ్డి,మట్టా రెడ్డి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఏం ఒరగబెట్టారని శాంతి బహుమతి?

ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు శ్వేతసౌధంలో విందు ఇవ్వడం, అనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం నుండి అధికారికంగా ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేయడం. ఇది జరిగి ఇరవై నాలుగు గంటలు గడవకముందే చంచల మనస్తత్వం, దూకుడు స్వభావం కలిగిన ట్రంప్ ఇరాన్ లోని మూడు అణ్వస్త్ర స్థావరాలపై (నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్) గత నెల (22-జూన్, -2025) మొదటిసారిగా తయారుచేసి పెట్టుకున్న బంకర్ బ్లస్టర్ బాంబులను ప్రయోగించి ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి తన ప్రమేయం లేకున్నా సినిమాలలో తళుక్కున మెరిసే అతిథి పాత్రవలే వచ్చి ఇరాన్‌లో విధ్వంస రచన చేసి ప్రపంచ రాజకీయాలలో ఓ చెడు ముద్రను వేసుకున్నాడు. దీని ఫలితం బహుశా ఇజ్రాయెల్ పాలకులు గాని, దానికి వంతపాడే అమెరికా అధికార గణం కూడా ఇరాన్‌ను తక్కువ అంచనా వేయడమే. గత ఇరవై ఒక్క నెలలుగా ఇజ్రాయెల్ గాజాలో ఎంతటి నరమేధం సృష్టిస్తుందో ప్రపంచం మొత్తం రెండు కళ్ళు వెడల్పు చేసుకోని చూస్తూనే ఉంది. పాలస్తీనలో ఇప్పటి వరకు (18 జూన్, %-% 2025 నాటికి) 57,800 మంది చనిపోయారని నివేదికలు తెలియజేస్తున్నాయి. వీరిలో అత్యధికంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు వీరెవరు ఇజ్రాయెల్ పైకి యుద్ధానికి నేరుగా వెళ్ళినవారు కాదు. అలా అని ఈ ఇరవై ఒక్క నెలల యుద్ధకాలంలో హమాస్ పూర్తిగా తుడిచిపెట్టుకనిపోయిందా అంటే సమాధానం లేని ప్రశ్న. అంటే ఇజ్రాయెల్ హమాస్‌పై యుద్ధం ప్రకటించి ఏం సాధించింది? గాజా ప్రాంతం మొత్తాన్ని నేలమట్టం చేసింది. అక్కడి ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇది చాలదన్నట్లుగా ఇరాన్‌పైకి ఆలోచన వచ్చిందే తడువుగా (13 జూన్, 2025 న) దాడికి ఆదేశాలివ్వడం నేతన్యాహు చేసిన రెండో అవివేకపు ఆలోచన. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే త్వరగా లొంగిపోతుంది. అక్కడి పాలకులతో కాళ్ళబేరానికి రప్పించి అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం (ఎన్‌పిటి) మీద సంతకం చేయించుకోవాలని చూశారు. కానీ వారు అనుకున్నట్లుగా జరుగలేదు. ఫలితంగా రెండు వైపుల పది రోజుల పాటు (23 -జూన్, -2025 వరకు) జరిగిన యుద్ధంలో ఇరాన్ వైపు సుమారు ఎనిమిది వందల మంది, ఇజ్రాయెల్ వైపు వందమంది పౌరులు మరణించినట్లు సమాచారం. ఇక భౌతికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడం చాలా కష్టమైన అంశం. గతంలో ఇజ్రాయెల్ అరబ్ దేశాలతో జరిగిన యుద్ధంలో (1967) కేవలం వారం రోజుల్లోనే గెలిచింది. మళ్ళీ ఇరాన్‌పై అలాగే గెలుస్తామని అనుకోవడం ఇజ్రాయెల్ చేసిన అతి పెద్ద పొరపాటు. ఈ పది రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ రక్షణ కవచం (ఐరన్ డోమ్) ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిసైళ్ళ ముందు తలొంచాల్సి వచ్చింది.

ఫలితంగా ఈ 77 సంవత్సరాల కాలంలో ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం ఇరాన్‌తో ఈ పది రోజుల యుద్ధంలో జరిగింది. ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహు అమెరికాను ముగ్గులోకి దించి ఇరాన్‌లోని అణ్వస్త్ర స్థావరాలను ధ్వంసంచేసి సంతృప్తి పడొచ్చు. కానీ దాడికి ముందే (22- జూన్, 2025) ఆయా అణ్వస్త్ర స్థావరాలనునుండి శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ తరలించిందన్నది ఓ వార్త కథనం. వెరసి అదే జరిగినా ఇరాన్ అంతర్జాతీయంగా ఈ యుద్ధం ద్వారా ప్రపంచానికి ఓ గట్టి హెచ్చరికను ఇవ్వగల్గింది. ఇరాన్ జోలికి ఎవరు వచ్చినా అంత తేలిగ్గా వదిలి పెట్టం అనేది ఆ హెచ్చరిక సారాంశం. ఈ అంశంలో ట్రంప్ మళ్ళీ ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కురుర్చింది తానేనని చెప్పి అంతర్జాతీయ మీడియాకు ఓ వార్త సాధనంగా మారగలరు కూడా. ఆపరేషన్ సిందూర్ విషయంలో కూడా అనవసరంగా తలదూర్చి తానే రెండు అణ్వస్త్ర దేశాల మధ్య కాల్పుల విరమణ కుదిర్చానని పదేపదే లీకులు ఇచ్చి మన నాయకత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేసే ప్రయత్నం చేయడం గమనార్హం. మరి ఇప్పుడు పాకిస్తాన్ అధికార గణం మళ్ళీ ట్రంప్‌ను నెత్తిన పెట్టుకొని నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని మళ్ళీ సిఫార్సు చేస్తుందేమో చూడాలి. ఇది చాలదన్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ పేరును తన మిత్ర బృందంతో పాటుగా అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డి కార్డర్ నార్వేలోని నోబెల్ కమిటీకి లేఖ పంపించడం గమనార్హం. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో తన హయాం లో ఎలాంటి యుద్ధాలు, యుద్ధ వాతావరణం ఉండదని చెప్పి వ్యూహాత్మకంగానే ఇజ్రాయెల్‌తో పాలస్తీనాలోని హమాస్ తిరుగుబాటుదారుల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటింపచేసి, ఎన్నికలు పూర్తి అయిన మరుక్షణం నుండే తిరిగి గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మారణహోమం సృష్టించడం ప్రారంభించింది. అక్కడ 24 గంటల్లో చిన్న పిల్లలకు ఆహారం దొరకకపోతే సుమారు పద్నాలుగు వేలకు పైగా చిన్న పిల్లలు చనిపోతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ, గాజాలో సహాయ చర్యల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సంఘాలు చెప్పినా వినకుండా నేటికి కూడా ప్రతిరోజు సుమరుగా 60 మందికి పైగా సైన్యం జరుపుతున్న దాడిలో చనిపోతూనే ఉన్నారు.

మరి ఇవన్నీ అమెరికా అధ్యక్షుడికి తెలియకుండా జరుగుతున్నట్లేనా? దీనికి తక్షణం పెద్దన్నగా ఇజ్రాయెల్‌ను ఒప్పించి శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి గాజా/ పాలస్తీనా పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయాలి. అలాగే ఐక్యరాజ్య సమితి (యుఎన్ఓ) 1948లో చేసిన ఇజ్రాయెల్ ఏర్పాటుతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాన్ని అగ్రరాజ్యం (అమెరికా) ఇజ్రాయెల్, యురోపియన్ యూనియన్ దేశాలు పాలస్తీనా ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చొరవ తీసుకొని ముందడుగు వేయాలి. తద్వారా పశ్చిమాసియాలో నిత్యం రగిలే రాచపుండు మాదిరిగా ఉన్న పాలస్తీనా సమస్యకు శాశ్వతంగా తెరపడుతుంది. ఇక రెండవది ఒక వైపు నాటోసభ్య దేశాలు, అలాగే యురోపియన్ యూనియన్ దేశాలతో ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ అగ్రరాజ్యం పరోక్షంగా ఉక్రెయిన్ - రష్యా మధ్య యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ వుంది. గత రెండున్నర సంవత్సరాలుగా రెండు దేశాల మధ్య యుద్ధం జరగడానికి పరోక్ష కారణం అగ్రరాజ్యమే. దీనినంతటినీ ప్రపంచం గమనిస్తూనే ఉంది.

# వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు చేపట్టండి

ఉంటే నూతన వదశాల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. బాలసముద్రంలోని కోకో పిట్ యూనిట్ ను పరిశీలించిన కమిషనర్ నిర్వహణ బాగుందని కొబ్బరి బొండాల వ్యర్థాలు ఎక్కువగా పేరుకు పోయి ఉన్నాయని వేగవంతంగా ప్రాసెసింగ్ చేసి నిల్వ లేకుండా చూడాలని ఈ యూనిట్ కార్పొరేషన్ కు మోడల్ గా నిలుస్తుందని 50 కిలో గ్రామ ల బల్క్ వేస్ట్ జనరేటర్ ను కమిషనర్ పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ యూనిట్ చాలా బాగుందని దీనిని మరింత బలోపేతం చేయడానికి మరో షెడ్ ను ఏర్పాటు చేసి సామర్థ్యాన్ని పెంచాలని ఈ ఈ నీ ఆదేశించారు. బయో మిథనైజేషన్ ప్లాంటుకు మరమత్తులు చేపట్టి పునరుద్ధరించాలని అలా కాని పక్షంలో ఇదే ప్రాంతం లో నూతన బయో మిథనైజేషన్ ప్లాంటు ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని విండ్రో కాంపోస్టు యూనిట్ ఉన్న ప్రాంతంలో నీరు చేరుతుందని దానిని అరికట్టడానికి అక్కడ మొరం వేసి అరికట్టి బలోపేతం చేయాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.హెచ్.ఓ డా. రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాలరావు, ఈఈ రవి కుమార్, డిఈ సారంగం, ఏఈలు రాగి శ్రీకాంత్, మేనక, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, వావ్ ప్రతినిధి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు జర్నలిస్టుల ఐక్య పోరాటాలు

సోమయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం అమల్లో ఉందనీ, దానిని రద్దు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మీడియా సంస్థల్లో జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలని కోరారు.

జర్నలిస్టుల పట్ల వివక్ష చూపటం మంచిది కాదని మామిడి సోమయ్య అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ,మీడియా రంగంలో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, జర్నలిస్టుల హక్కులు హరించి వేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులకు కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని, యాజమాన్యాలు వెట్టిచాకిరికి గురిచేస్తున్నాయనిఅన్నారు.

ప్రజా సమస్యలపై అధ్యయనం, హక్కుల సాధన దిశగా జర్నలిస్టులు ముందుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్ యుజే అధ్యక్షులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టు చట్టం రద్దు ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు పి. ఆనందం, బి రాజశేఖర్, కార్యదర్శులు ఇ.చంద్ర శేఖర్, సలీమా, గండ్ర నవీన్, హెచ్ యుజే కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నాగవాణి, మధుకర్, విజయ, మాధవ రెడ్డి, కాలేబ్, వీరేశ్,వెంకట స్వామీ, సీనియర్ జర్నలిస్టులు రత్నాకర్ సురేష్,భాస్కర్, శశికళ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**- జర్నలిస్టు సంఘాలకు కార్మిక సంఘాల ధన్యవాదాలు**

కార్మికుల సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలిపిన టిడబ్ల్యూజేఎఫ్,హెచ్ యుజే జర్నలిస్టు సంఘాలకు పలు కార్మిక సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా, ఎంఎస్ నాయకులు రెబ్బ రామారావు లతో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక చట్టాలతో పాటు వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను సైతం కేంద్రం రద్దు చేస్తోందనీ, దీనిని సంఘటితంగా ఎదుర్కోవాలని కార్మిక నేతలు అన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ కల్లు కలకలం

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీతారాం అనే వ్యక్తి మృతి చెందాడు. గాంధీలో చికిత్స పొందుతూ.. స్వరూప అనే మహిళ చనిపోయింది. కల్తీ కల్లు ఘటనలో హైదర్‌నగర్‌లో మరో ఇద్దరికి అస్వస్థతగురయ్యారు. జగన్, లక్ష్మమ్మ అనే ఇద్దరికి వాంతులు, విరేచనాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. నిమ్స్ ఆస్పత్రిలో కల్తీ కల్లు బాధితులను పరామర్శించారు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. ఘటన జరిగిన వెంటనే వేగంగా స్పందించి.. అందరినీ హాస్పిటల్స్‌కు తరలించామన్నారు. కల్తీ కల్లుతో 19మంది అస్వస్థతకు గురయ్యారని.. వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.వాస్తవానికి కల్లు అనగానే పల్లెటూళ్లు గుర్తుకొస్తాయి. తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే కల్లు ప్రజలు తాగి ఆస్వాదిస్తుంటారు, కల్లుతాగితే మంచిదని కూడా కొంతమంది చెబుతుంటారు. పల్లెల్లో సరే.. పొట్టకూటి కోసం పట్టణాలకు వచ్చిన వారి కోసం నగరాల్లో కల్లు కాంపౌండ్లు వెలిశాయి. నగర శివారు ప్రాంతాల నుంచి కల్లు సేకరించి ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తారు. అయితే కల్లు కాంపౌండ్




నిర్వాహకుల కాసుల కక్కుర్తి కల్తీ కల్లు దారుణాలకు కారణమవుతోంది. సాధారణంగా చెట్టు నుంచి తీసిన కల్లు మంచింది.. కానీ కృత్రిమంగా తయారు చేసిన, రసాయనాలు కలిపిన కల్లు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి.సాధారణంగా కల్లును పలచగా చేసి ఎక్కువ క్వాంటిటీ కోసం నీళ్లను విరివిగా కలుపుతారు. వాటర్ మిక్స్ చేసినంత వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ కొంతమంది కక్కుర్తితో ప్రమాదకర, నిషేధిత రసాయనాలు కలుపుతున్నారు. టేస్ట్ కోసం.. కల్లు తాగే వారికి ఎక్కువ కిక్కు ఇచ్చేందుకు ఇలాంటి కల్లు కల్తీ చేస్తూ ప్రయోగాలు చేస్తున్నారు. కల్తీ కల్లులో అల్ప్రజోలం, క్లోరోహైడ్రేట్, డయాజెపామ్ వంటి మత్తు పదార్థాలు మిక్స్ చేస్తున్నారు. ఇలాంటివి మిక్స్ చేస్తే కల్లు తాగిన వారి ఆరోగ్యం పాడవుతుంది. ముఖ్యంగా మోతాదుకు మించి రసాయనాలు కలిపినప్పుడు కల్లు తాగిన బాధితులు వాంతులు, విరేచనాలతో తీవ్రఇబ్బందులు పడుతూ అస్వస్థతకు గురవుతారు. కొన్ని సందర్భాల్లో కిడ్నీలపై ప్రభావం పడి మరణిస్తారు. కల్తీ కల్లు బాధితుల్లో ఎక్కువ మందికి నరాలపై తీవ్రప్రభావం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

### ఇక ఆ కార్మికుల ఆచూకీ

# లభించడం అసాధ్యం

**- సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**వేద న్యూస్, డెస్క్:**




సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ఆచూకీ లభించని ఎనిమిది మంది కార్మికులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఇవాళ (బుధవారం) ఓ ప్రకటన విడుదల చేశారు. ఇక ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ లభించడం అసాధ్యమని అధికారులు తేల్చివేశారు. రాహుల్, శివాజీ, వెంకటేష్, విజయ్, అఖిలేష్, జస్టిన్, రవి, ఇర్ఫాన్ ప్రమాద సమయంలో కాలి బుడిదై ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే వందశాంపిల్స్ సేకరించిన డీఎన్ఏ మ్యాచ్ కాలేదని అధికారులు తెలిపారు. ఎనిమిది మంది కార్మికుల కుటుంబ సభ్యులను ఇంటికి వెళ్లిపోవాలని అధికారులు సూచించారు. మూడు నెలల తర్వాత తిరిగి రావాలని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అప్పటి వరకు రాష్ట్ర, కేంద్ర హోంశాఖలతో సంప్రదింపులు జరుపుతామని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో రెండురోజులు వానలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో రాగల రెండు రోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.

### అభివృద్ధిలో కీలక

# పాత్ర కలెక్టర్లదే




**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న చర్యల ద్వారా మైనింగ్ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మైనింగ్ ద్వారా వచ్చే ప్రతి పైసకు అకౌంటబిలిటీ ఉంటుందని ఉద్ఘాటించారు. గతంలో ఇల్లీగల్ మైనింగ్ జరిగేదని విమర్శించారు. ఇవాళ(బుధవారం) ఢిల్లీలో డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా గనులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఆయా రాష్ట్రాల గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మైనింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. మైనింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. డిస్టిక్ మినరల్ ఫౌండేషన్‌కు వచ్చే ఫండ్ మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని వివరించారు. డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తారని తెలిపారు కిషన్‌రెడ్డి. మూడు రోజుల క్రితం వరకు తెలంగాణలో కూడా మంత్రులే డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు చైర్మన్లుగా ఉండేవారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు కలెక్టర్లను చైర్మన్లుగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. డీఎంఎఫ్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాములుగా ఉంటారని స్పష్టం చేశారు. మైనింగ్ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర కలెక్టర్లదేనని ఉద్ఘాటించారు. డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ స్థాపించి పదేళ్లు అయ్యిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

వేద న్యూస్



# సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిపై స్పందించిన జేపీ నడ్డా

- తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరాకు జేపీ నడ్డా హామీ
- ఎరువుల సరఫరాకు మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు
- యూరియా వాడకం 21 శాతం పెరగడంపై కేంద్రం ఆందోళన
- ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలని అధికారులకు సూచన
- సేంద్రియ సాగుకు 'ప్రణామ్' పథకం ద్వారా ప్రోత్సాహం
- కేంద్రమంత్రి జేపీ నడ్డా..




**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఖరీఫ్ సీజన్‌లో తమ రాష్ట్రంలో యూరియాకు గరిష్టంగా డిమాండ్ ఉంటుందంటూ కేంద్రమంత్రి జేపీ నడ్డాకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా తెలంగాణకు కేంద్రప్రభుత్వం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు. అయితే సీఎం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతుల డిమాండ్‌ను నెరవేర్చే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు కేంద్రమంత్రి జేపీ నడ్డా.

అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. ఇవాళ (బుధవారం) ఢిల్లీలో జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. రసాయన ఎరువులు అధికంగా వాడటంతో భూమిలోని సారం తగ్గిపోతోందని ముఖ్యమంత్రికి కేంద్రమంత్రి జేపీ నడ్డా సూచించారు. 2023-24 రబీతో పోలిస్తే 2024- 25లో 21శాతం అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయని కేంద్రమంత్రి వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటివరకు 12.4శాతం అదనపు వినియోగం జరిగిందని చెప్పుకొచ్చారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను దారి మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఎరువులు, సేంద్రీయ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి %ఖావీ ్రా=ూచీూవీ% పథకం గురించి తెలంగాణ అధికారులకు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య ఎరువుల సమన్వయాన్ని చేస్తూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులకు కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆదేశించారు.

# విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్ రెడ్డి

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కూడా అందించలేని దుస్థితి
- మూడు నెలలుగా భోజన బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం
- విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తానని కోతలు కోసే రేవంత్ రెడ్డీ

**వేద న్యూస్, డెస్క్:**

విజన్ 2047 గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 20 నెలల పాలనలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కూడా అందించలేని దుస్థితికి ఈ ప్రభుత్వం చేరుకున్నది అని విమర్శించారు. మూడు నెలలుగా భోజన బిల్లులు చెల్లించకపోవడం వల్ల, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గొడ్డుకారం, నీళ్ల సాంబారే భావి భారత పౌరులకు భోజనం అయింది.




మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించవలసి ఉన్నప్పటికీ ప్రభుత్వ అలసత్వం వల్ల ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీలు చేయవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే దుస్థితి ఉన్నప్పటికీ పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తానని కోతలు కోసే రేవంత్ రెడ్డీ.. కనీసం విద్యార్థులకు ఒకపూట అన్నం పెట్టే పరిస్థితిలో కూడా లేవా? అని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూలు, స్కిల్ యూనివర్సిటీ అని మాటలు కోటలు దాటుతాయి కానీ చేతలు మాత్రం గడప కూడా దాటని పరిస్థితి. నీ నిర్లక్ష్యంతో ఒకవైపు గురుకులాల ఖ్యాతిని దిగజార్చావు.. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పోగొడుతున్నావు. విద్యాశాఖ నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీలో సమర్థవంతమైన మంత్రి లేడా. ఇంకెన్నాళ్లు మంత్రి లేని అనాథగా విద్యాశాఖ ఉండాలి? ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి తూట్లు పొడిచి మళ్ళీ విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నావా రేవంత్ రెడ్డి. ఢిల్లీ ట్రిప్పులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, పొలిటికల్ డైవర్షన్లు బంద్ పెట్టి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించండి. విద్యాశాఖపై సమీక్ష చేయండి. మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు

# జగన్మోహన్‌రావు అరెస్ట్

- హెచ్‌సీఏ వ్యవహారంలో సీఐడీ చర్యలు
- జగన్మోహన్‌రావుతో పాటు మరో వ్యక్తి అరెస్టు
- విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల సీఐడీ కేసు నమోదు

**వేద న్యూస్, డెస్క్:**



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అరెస్ట్ అయ్యారు. సన్‌రైజర్స్ హైదరాబాద్, హెచ్‌సీఏ వ్యవహారంలో సీఐడీ చర్యలు చేపట్టింది. జగన్మోహన్‌రావుతో పాటు మరో వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన సీఐడీ అధికారులు.. తాజాగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల కేసు సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గత ఐపీఎల్ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్-హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం చెలరేగింది. మ్యాచ్ టికెట్లు కేటాయించలేదంటూ కార్పొరేట్ బాక్స్‌కు హెచ్‌సీఏ తాళం వేసింది. ఈ ఘటనతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్‌ను వీడిపోతామని హెచ్చరించింది. అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలే చేసింది. ఘటనపై గతంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీపై హెచ్‌సీఏ అధ్యక్షుడు ఒత్తిడి తీసుకువచ్చినట్లుగా విజిలెన్స్ విచారణలో తేలింది. టికెట్ల కోసం ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేశారని నిర్ధారణ అయ్యింది. వాస్తవానికి ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తీవ్రంగా వేధిస్తున్నాడని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఇలాగే చేస్తే తాము హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని హెచ్చరించింది. ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సీఏ అధికారులు, అధ్యక్షుడి నుంచి వేధింపులు తీవ్రమయ్యాయని.. ఇలాంటి ప్రవర్తనను సహించమని స్పష్టం చేసింది. ఇలాగే కొనసాగితే తాము వేదికను మార్చుకునేందుకు వెనుకాడబోమని.. ఉప్పల్ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా ఎంచుకుని మ్యాచ్‌లు ఆడటం వారికి ఇష్టం లేనట్లుగా ఉందంటూ హెచ్‌సీఏ కోశాధికారికి లేఖ సైతం రాసింది. లిఖితపూర్వకంగా చెబితే హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని.. ఈ విషయంపై బీసీసీఐకి, తెలంగాణ ప్రభుత్వం, జట్టు యాజమాన్యానికి తెలుపనున్నట్లు చెప్పింది. గత 12 సంవత్సరాలుగా హెచ్‌సీఏతో కలిసి పని చేస్తున్నామని.. గత సీజన్ నుంచి మాత్రమే ఈ సమస్యలు, వేధింపులు ఎదుర్కొంటున్నట్లుగా పేర్కొంది. ప్రతి సీజన్‌లో 50 కాంప్లిమెంటరీ టికెట్లు ఇస్తున్నామని.. ఈ ఏడాది వారు అదనంగా మరో 20 టికెట్లు అడుగుతున్నారని ఆరోపించింది. ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ వివాదం తీవ్రస్థాయికి చేరడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

# రాజస్థాన్‌లో కూలిన యుద్ధవిమానం

**వేద న్యూస్, డెస్క్:**



రాజస్థాన్ లో ప్రమాదం చోటు చేసుకుంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. చురు జిల్లా రతన్‌గఢ్ ప్రాంతంలోని భానుడా గ్రామ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం కూలిపోయినట్లు రక్షణ శాఖ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇద్దరు వైమానిక సిబ్బంది గాయపడినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి బయల్దేరి వెళ్లారు. ప్రమాదం సమయంలో పెద్ద శబ్దం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఫైటర్ జెట్ పొలాల్లో కూలిందని, భారీగా మంటలు, పొగ ఎగసిపడినట్లు చెప్పారు.

## గుజరాత్ వడోదరలో

# కుప్పకూలిన గంభీర వంతెన




**వేద న్యూస్, డెస్క్:**

గుజరాత్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. వడోదర, ఆనంద్ జిల్లాలను కలిపే గంభీర నదిపై ఉన్న పురాతన వంతెన బుధవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటన సమయంలో వంతెనపై నుంచి వెళుతున్న ఐదు వాహనాలు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో కనీసం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, పలువురిని సహాయక బృందాలు సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. ప్రమాద విషయం తెలియగానే అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. నదిలో గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. అయితే, ఈ వంతెనకు గతేడాది మాత్రమే మరమ్మతులు చేపట్టడం గమనార్హం. అంతేకాకుండా, దీనిపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి మూడు నెలల క్రితమే రూ. 212 కోట్ల వ్యయంతో కొత్త వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపారు. కొత్త వంతెన కోసం డిజైన్, టెండర్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైన తరుణంలో ఈ దుర్ఘటన జరగడం విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై గుజరాత్ ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలానికి చీఫ్ ఇంజనీర్, బ్రిడ్జ్ డిజైన్ బృందంతో పాటు నిపుణులను పంపించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పాత వంతెన మరమ్మతులపై, దాని నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# గుజరాత్ యూనివర్సిటీలో కలకలం

- 100 మందికిపైగా విద్యార్థులకు అస్వస్థత - భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత విరేచనాలు, వాంతులు

**వేద న్యూస్, డెస్క్:**



గుజరాత్‌లోని ఓ యూనివర్సిటీ లో కలకలం చోటు చేసుకుంది. దాదాపు 100 మందికిపైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు వారంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వడోదరలోని మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయంలోని ఎస్‌డీ హాల్ హాస్టల్‌లో 100 మందికిపైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి సమయంలో హాస్టల్‌లో డిన్నర్ చేసిన తర్వాత వారంతా ఇబ్బందికి గురయ్యారు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత విద్యార్థులు విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. మెస్‌లో భోజనం చేసిన సుమారు 350 మంది విద్యార్థుల్లో 100 మందికిపైగా విద్యార్థుల్లో ఫుడ్ ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించాయి. హాస్టల్ యాజమాన్యం వెంటనే విద్యార్థులను చికిత్స నిమిత్తం గోత్రి, సాయాజీ ఆసుపత్రులకు తరలించారు. ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. కలుషితమైన ఆహారం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు అనుమానిస్తున్నారు. అయితే, అదృష్టవశాత్తూ విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనతో వర్సిటీ హాస్టల్‌లో ఆహార భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు వర్సిటీకి చేరుకొని హాస్టల్ మెస్‌నుంచి శాంపిల్స్ కలెక్ట్ చేసుకున్నారు. మరోవైపు హాస్టల్ మెస్‌లో అందించే ఆహారం నాణ్యత విషయంలో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్ నాణ్యత విషయంలో గతంలో చాలాసార్లు హాస్టల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ఇలా నాసిరకం ఆహారం తింటున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజా ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073